సన్నబియ్యం ఇవ్వడంలో విఫలమైన ప్రభుత్వం

మాట్లాడుతున్న దేవనిసతీశ్ మాదిగ

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 2 : కాంగ్రెసు ప్రభుత్వం కొత్త సంవత్సరంలో సంక్రాంతికి సన్న బియ్యం సరఫరా చేస్తామని ఇచ్చిన మాట తప్పిన వైనం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ చేతకానితనానికి నిదర్శనమని బీఆర్ఎస్ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవనికుమార్ విమర్శించారు. ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సక్రాంతికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్‌షాపులకు సన్న బియ్యం సరఫరా చేస్తామని ఆయన మాటలు ఉట్టినీటి మూటలైనవని ఎద్దేవా చేశారు.అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమ హాస్టళ్లలో సన్న బియ్యం సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురుకులలో విద్యార్థులకు పురుగులన్నం పెట్టడంతో పుడ్‌పాయిజన్‌అయి ఎంతోమంది దవాఖానలో చేరిన ఘటనలు ప్రజలు మరిచిపోలేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో అన్నిగురుకులలో విద్యార్థులకు సన్న బియ్యం పెట్టేవారని కాంగ్రెస్ వచ్చాక అస్తవ్యస్థంగా మారిందన్నారు.

బైపాస్‌రోడ్డు ఆలైన్‌మెంట్‌ను మార్చాల్సిందే

కోల్పోతున్న భూముల వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

- సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ధం పర్వతాలు

తాడూరు, ఫిబ్రవరి 2 : తాడూరులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారికి సంబంధించి బైపాస్ రోడ్డు ఆలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనని సీపీఎం జిల్లా ప్రధానకార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు వస్తున్న ప్రాంతంలో కోల్పోతున్న భూముల వద్ద సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న దళితులు, బీసీ, బడుగు బలహీన వర్గాల ప్రజలను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. భూములు కోల్పోతుండడంతో తాడూరుకు చెందిన శేఖర్, కురు మూర్తిలు ఆత్మహత్యాయత్నం చేసుకుని చావు బతుకుల మధ్య పోరాడుతున్నారన్నారు. పొలాల్లో నుంచి జాతీయ రహదారి నిర్మాణం చేపట్టినట్లయితే ఎంతకై నా తెగించి పోరాడు తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న ఆలైన్‌మెంట్‌ను మార్చిపేద దళితులకు చెందిన భూములు కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమం లో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల కార్యదర్శి కాశన్న, కాశన్న, శంకర్, బలరాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధిహామీ దినోత్సవం

అచ్చంపేటలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 2 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్)ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నాగర్‌కర్నూల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పథకం ఆవిర్భవించి 20సంవత్సరాలు పూర్తయి గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడిందని పథకంతో గ్రామాల్లో భూముల అభివృద్ధి, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, రహదారులు, పండ్ల తోటలు, వర్మీ కంపోస్టు షెడ్లు మొదలైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఎంపీడీవో కోటేశ్వర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లాఉద్యోగులు శ్రీనివాస్, క్రాంతి, రాజేశ్‌కుమార్, బాలయ్య, సత్యనారాయణ, బాలరాజ్, ఎం.శ్రీనివాస్, మల్లికార్జున్, జీవన్, పవన్, ఇసాక్, నాగరాజు, మాధవా చారి, మహేందర్, మంజుల, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 2: ఉపాధి హామీ ఆవిర్భవ దినోత్సవాన్ని ఆదివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రవినాయక్ మాట్లాడుతూ.. పథకం ఆవిర్భవించి 20ఏండ్లు పూర్తయిందన్నారు. భూమి అభివృద్ధి పనులు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠదామాలు, పొలాలకు వెళ్లే రహదారులు, పండ్లతోటలు, వర్మీ కంపోస్టు, పశువులపాకలు మొదలైన అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో పాల్గొన్న ఎంపీడీవో కోటేశ్వర్, ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 2 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా పేదలను దగా చేసేదిగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్.దేశ్యానాయక్ అన్నారు.ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్లకార్డు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుచి ఆడపడుచునా నిర్మలమ్మ ఎని విసోసారి బడ్జెట్ ప్రవేశపెట్టినా తెలంగాణకు మొండిచేయి చూపి కార్పొరేట్లు ఆదానీ, అంబానీకు ఎర్రచివాచి పరించిందన్నారు. 8 మంది ఎంపీలుగా బీజేపోల్లు పైసా నిధులు రాష్ట్రానికి తేవడంలో విఫలమైనారన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు ప్రధానంగా నాగర్ కర్నూల్ జిల్లాకు రైల్వే లైను ఊసేలేదని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లేశ్, సీనియర్ నాయకులు రాములు, శివకుమార్ ఐద్వా మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్యకంటి నిర్మల, నాయకులు సైదమ్మ, పార్వతమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, సీపీఎం నాయకులు చిన్నయ్య, సురేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

తైక్వాండో కలర్ బెల్ట్‌టెస్ట్ విజయవంతం

కలర్ బెల్ట్ సాధించిన విద్యార్థులతో జనరల్ సెక్రటరీ రవికుమార్

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 2 : ఆదివారం జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్‌లో గ్రౌండ్‌లో తైక్వాండో విద్యార్థులకు కలర్ బెల్ట్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించారు. టెస్ట్‌లో విద్యార్థులు పంచెస్, బ్లాక్స్, కిక్స్, పుంసే వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చి బెల్ట్ సర్టిఫికెట్లు సాధించారు. ఎల్లో బెల్టు సాధించిన విద్యార్థులు అనన్య, నితిశ్రీశ్యం, నేహా, నమ్రుత్, ఎల్లో వన్ బెల్ట్ సాధించిన విద్యార్థులు దివిజ, అర్జున్, సాయి, మన స్విని, సాయి మనోజ్ఞ, సుమేధ, సాయిమోక్ష గ్రీన్ బెల్ట్ సాధించిన విద్యార్థులు సి.ప్రణీత్, డి.వెంకటలక్ష్మీ, గ్రీన్‌వన్ బెల్ట్ సాధించిన విద్యార్థి రితిక మొదలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ శ్రీను, జనరల్ సెక్రటరీ రవికుమార్, ట్రెజరర్ మాస్టర్ స్వామివారి చేతుల మీదుగా బెల్టు సరిఫికెట్లు అందజేశారు.

నేటినుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాలు
- ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్న 4,094 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష
- నాలుగు దశల్లో పరీక్షల నిర్వహణ
- ఏర్పాట్లు చేపట్టిన ఇంటర్‌బోర్డు అధికారులు

నాగర్‌కర్నూల్‌లోని బాలికల జూనియర్ కళాశాల

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 2 : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 3 నుంచి 22వ తేదీ వరకు నాలుగు దశలుగా ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. ఈసారి ప్రయోగ పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిపించనున్నారు. గత సంవత్సరం ప్రైవేట్ కళాశాల్లో డిపార్ట్‌మెంట్ అధికారులు ఉండేవారు. కానీ ఈసారి ప్రభుత్వం కొత్త నిబంధనలను అమలు పరుస్తూ డిపార్ట్‌మెంట్ అధికారులు లేకుండానే సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రయోగ పరీక్షలు జరిపించనుంది. ఒక్కో స్పెల్‌ను ఐదు రోజుల చొప్పున 20 రోజులపాటు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 43 పరీక్షా కేంద్రాల్లో 4094 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరుకానున్నారు.

43 కేంద్రాల్లో పరీక్షల నిర్వాహణ :

జిల్లాలో 43 పరీక్షాకేంద్రాల్లో ప్రయోగ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 14 ప్రభుత్వ, 14 ప్రభుత్వ రంగ, 15 ప్రైవేట్ కళాశాల్లో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సారి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రయోగపరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని కేంద్రాల్లో సీసీలను అమర్చారు. జిల్లాలో ప్రథమ సంవత్సరం, వృత్తి విద్యకు సంబంధించిన 1,412 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 2,682 మంది విద్యార్థులు మొత్తం 4,094 మంది ప్రయోగ పరీక్షల్లో పాల్గొననున్నారు. రెండుసెషన్లలో పరీక్ష నిర్వహణ ఉండనుంది. ఉదయం 9నుంచి 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండవ విడత ప్రయోగ పరీక్షను నిర్వహించనున్నారు. నాలుగుదశల్లో నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ కేటాయించారు. ఇందులో భాగంగానే ఒక్కో స్పెల్‌ను ఐదు రోజుల పాటు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు.ప్రతి పరీక్షా కేంద్రానికి ఒకచీఫ్ సూపరింటెండెంట్ చొప్పున 43 మందిని నియమించారు. పరీక్ష నిర్వహణ డీఐఈవో పర్యవేక్షించనున్నారు. మొదటిసారి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఇంటర్ విద్యార్థులు ప్రయోగ పరీక్షలను ఏవిధంగా హాజరవుతారన్నది వేచి చూడాల్సి ఉంది.

అన్ని ఏర్పాట్లు చేపట్టాం

ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకోసం పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేపట్టాం. అన్ని పరీక్షాకేంద్రాల్లో సీసీ కెమెరాలను బిగించాం. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరంతోపాటు, వృత్తి విద్య, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 4 వేలకు పైగా పాల్గొననున్నాయి. ప్రతి కేంద్రం వద్ద అన్ని సౌకర్యాలు విద్యార్థులకు కల్పించాం. ప్రతిప్రయోగశాల కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ పర్యవేక్షిస్తారు.

- వెంకటరమణ,డీఈఐవో, నాగర్‌కర్నూల్

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే

బల్మూరు, ఫిబ్రవరి 2 : గోదల్ గ్రామానికి ఏడాదిలో అనేక అభివృద్ధి పనులను మంజూరు చేశామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఆదివారం గ్రామంలోని రామలింగేశ్వర ఆలయం వద్ద రూ.5లక్షలతో ఆయన భూమిపూజ చేశారు. అదేవిధంగా గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తూ ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంజూరు చేసిన పనులను త్వరగా పూర్తి చేసుకోని కొత్తగా పనులను అడగాలని కోరారు.కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, జంగయ్య, శంకరయ్య ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళా మృతి

తాడూరు, ఫిబ్రవరి 2 : మండలంలోని పర్వతాయిపల్లి గ్రామానికి చెందిన చిట్టి(40) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. పర్వతాయిపల్లి గ్రామానికి చెందిన అంజి, చిట్టెమ్మ దంపతులు మధ్య కొంత కాలంగాకుటుంబ కలహాల నేపథ్యంలో గతనెల 28న పురుగు మందు తాగింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో మృతురాలి భర్త అంజి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోవడం జరిగింది. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

మైనర్‌బాలికతో చిన్నన్న అసభ్య ప్రవర్తన

- కేసు నమోదు చేసిన పోలీసులు

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 2 : మండలంలోని ఓ గ్రామ పంచాయతీకి చెందిన ఓ బాలికతో వరుసకు చిన్నన్న అనే వ్యక్తి ఆదివారం అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఆంజనేయ స్వామి ఇరుముడి కార్యక్రమాలకు వచ్చిన సందర్భంలో అసభ్యకరంగా తన శరీరం ప్రైవేట్ భాగాల్లో తాకడంతో తల్లిదండ్రులకు విషయాన్ని తెలియపరిచి సదురు వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

కూలీలకు రూ.12వేలు ఇవ్వాలి

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 2 : జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఇవ్వాలని మండలం వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలోని ముక్కిడిగుండం గ్రామంలో వ్యవసాయ కార్మికసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నూతన వ్యవసాయ కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా వర్తెగణేశ్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా శంకర్, సహాయ కార్యదర్శిగా రాముడు, సభ్యులుగా సేవ్యానాయక్, శ్రీను, శంకర్, కుర్మయ్యలు ఉన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, హరియా బొజ్జ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఉప్పలట్రస్ట్ బృందం

కల్వకుర్తి, ఫిబ్రవరి 2 : పట్టణంలోని7వ వార్డుకు చెందిన షేక్‌ఫరీద్ కుటుంబాన్ని ఆదివారం ఉప్పల చారిట బుల్ ట్రస్ట్ బృందం పరామర్శించింది. షేక్‌ఫరీద్ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ట్రస్ట్ అధినేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్ బాధిత కుటుంబానికి చేయూత నందించాలని ట్రస్ట్ సభ్యులకు సూచించారు. బృందం రూ.3వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేశ్, మాజీమున్సిపల్ చైర్మన్ శ్రీశైలం, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, భగత్‌సింగ్, మూర్తి, శ్రీనూనాయక్, షకీల్, హనుమంతు నాయక్, సాధిక్, జాహిద్, షేక్‌బాబా పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లను పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 2 : ఉమామహేశ్వరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళ కార్మికులకు దుపట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా స్వచ్ఛమైన, శుద్ధజలాన్ని భక్తులకు అందించాలనే ఉద్దేశంతో క్లబ్ సహకారం అందించినట్లు బీరంమాధవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు కోటేశ్వర్ రావు, యాదయ్య, సత్యనారాయణ, శ్రీను, రఘుపతిరెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, శివశంకర్, నర్సింహారావు, బాలాజీ, నరేశ్, పవన్‌కుమార్, లింగాచారి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం విజయవంతం

కొట్రలో వైద్యచికిత్సలు చేస్తున్న వైద్యులు

వెల్దండ, ఫిబ్రవరి 2 : మండలంలోని కొట్ర గ్రామంలో మెట్రో స్పెషాలిటీ అల్మాస్‌గూడ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. కొట్ర గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో 400 మందికి వైద్యచికిత్సలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, రాకేశ్‌గౌడ్, నిర్వాహకులు రమేశ్‌గౌడ్, శ్రీకాంత్, సురేశ్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా విద్యుత్ క్వార్టర్స్

నిరుపయోగంగా మారిన విద్యుత్ ఉద్యోగుల గదులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 2 : ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గత పాలకులు నిర్మించిన విద్యుత్ సిబ్బంది క్వార్టర్స్ నిరుపయోగంగా మారాయి. నాడు రూ.లక్షలతో వెచ్చించి వీటిని నిర్మించారు. కానీ నేడు ఈ భవనాలు బూత్‌బంగ్లాలుగా తయారయ్యాయి. పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. కరెంటు సిబ్బంది అంటేనే తమకు కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండి 24 గంటల వినియోగదారులు సేవలు అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన క్వార్టర్స్ నివాసం ఉండకపోవడంతో నిరుపయోగంగా మారాయి. సిబ్బంది మాత్రం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిపోతున్నారు. దీంతో అందుబాటులోలేని విద్యుత్ సిబ్బందితో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

- వృథాగా దోమలపెంట పీఈఎస్ కంపెనీ షెడ్డు
- ఇనుపరేకులు, పైపులను దొంగిలిస్తున్న వైనం
- ఉపయోగంలోకి తీసుకురావాలంటున్న స్థానికులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగ మారిన పీసీఎస్ కంపెనీ షెడ్

దోమలపెంట, ఫిబ్రవరి 2 : అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పీఈఎస్ మారింది. దోమలపెంట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈ కంపెనీ షెడ్డు వృథాగా మారింది. శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం నిర్మాణ సమయంలో 1993లో పెన్‌స్టాక్ పైపులు తయారు చేసేందుకు సుమారు రూ.2 కోట్లతో షెడ్డును ఏర్పాటు చేశారు. ఇక్కడ పెన్‌స్టాక్ పైపులు, బైండింగ్ మిషన్, ఇతరత్రా పనిముట్ల తయారీతోపాటు ఈవోటీ క్రేన్ ఉండేది. కాలక్రమేనా భూగర్భ జల విద్యుత్ కేంద్రం పూర్తయిన తర్వాత కంపెనీలోని మిషన్లను తీసుకొని 25 ఏండ్ల కిందటే ఖాళీ చేశారు. నాటి నుంచి షెడ్డు వృథాగా ఉండడంతో శిథిలావస్థకు చేరింది. దీనికి తోడు ఇక్కడున్న ఇనుప రేకులు, పైపులు ఎవరి ఇష్టమొచ్చినట్లు వారు మాయం చేశారు. శ్రీశైలం-హైదరాబాద్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. షెడ్డు నిరుపయోగంగా ఉండడంతో మద్యం, గంజాయి, అసాంఘిక కార్యక్రమాలకు కేరాఫ్‌గా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. షెడ్డులో సుమారు రూ.కోటి ఇనుప సామగ్రి, ఈవోటీ క్రేన్ ఉన్నది. అలాగే వదిలేస్తే ఈ వస్తువులు కూడా చోరికి గురయ్యే అవకాశం ఉన్నది. వెంటనే గ్రామ పంచాయతీ షెడ్డును స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి ఈ షెడ్డును ఫంక్షన్‌హాల్‌గా.. షాదీఖానగా.. లేదా ఇండోర్ స్టేడియంగా మార్చి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు.

పంచాయతీ స్వాధీనం చేసుకోవాలి

దోమలపెంట గ్రామంలో వృథాగా పడిఉన్న పీఈఎస్ షెడ్డును వినియోగంలోకి తీసుకొస్తే బాగుంటుంది. ఇప్పటికే అక్కడున్న విలువైన సామగ్రి అపహరణకు గురైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.. అందరికీ ఉపయోగపడేలా ఫంక్షన్‌హాల్ నిర్మిస్తే బాగుంటుంది. లేకుంటే అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉన్నది.

- బొంతల పార్థసారథి యాదవ్, మాజీ వార్డుసభ్యుడు

స్టేడియంగా మార్చాలి

వృథాగా ఉన్న పీఈఎస్ షెడ్డును ఇండోర్ స్టేడియంగా మార్చితే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం వృథాగా ఉండడం.. శిథిలావస్థకు చేరడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అధికారులు దృష్టి సారించాలి.. స్టేడియం నిర్మిస్తే క్రీడలను ప్రోత్సహించినట్లు అవుతుంది. స్థానిక యువతలో క్రీడా నైపుణ్యం పెరుగుతుంది.

- ఇజాస్ అహ్మద్, క్రీడాకారుడు

'లక్ష డప్పులు వేలగొంతుల' పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పునుంతలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉప్పునుంతల, జనవరి 2 : మండలకేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజమౌళి ఆధ్వర్యంలో లక్షడప్పులు, వేలగొంతుల సాంస్కృతిక ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పార్టీలకతీతంగా తరలిరావాలన్నారు. వెంకటయ్య, శ్రీనివాసులు, లక్ష్మయ్య, రేణు, శ్రీశైలం, పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, ఫిబ్రవరి 2 : మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఆదివారం లక్ష డప్పులు-వేల గొంతుకల పోస్టర్లను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయ్, దశరథం, శివయ్య, మహేశ్, రఘు, అజీమ్ తదితరులు ఉన్నారు.

వంగూరులో...

వంగూరు, ఫిబ్రవరి 2 : ఈ నెల 7న హైదరాబాద్‌లో మందకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష డబ్బులు-వేల గొంతుల ర్యాలీ పోస్టర్‌ను అంబేద్కర్‌చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిరంజన్, బాలస్వామి, కృష్ణ, రమేశ్, పరమేశ్, శివకుమార్, శ్రీశైలం, పర్వతాలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా గాజర గ్రామానికి చెందిన మండల నాయకులు సైదులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళమృతి

బిజినేపల్లి, ఫిబ్రవరి 2: ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్ట బండ్లగూడకు చెందిన రహిమాన్‌బీ(56) అనే మహిళ వెంకటాపూర్ దర్గా సమీపంలో మొక్కులు తీర్చుకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌నుంచి నాగర్‌కర్నూల్ వైపునకు వెళ్తూ మహిళను ఢీకొట్టింది. దీంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా ఘటనకు సంబంధించిన పూర్తివివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

ప్రమాద భరితంగా మ్యాన్‌హోల్

- చూడకపోతే గోతిలోకే
- అధికారుల దృష్టికి తెచ్చినా.. ఫలితం లేదు

ప్రమాద భరితంగా ఉన్న మ్యాన్‌హోల్ దృశ్యం

కల్వకుర్తి, ఫిబ్రవరి 2 : భారీ వాహనం వెళ్లడంతో మురుగునీటి కాల్వకు సంబంధించిన మ్యాన్‌హోల్ దెబ్బతింది. మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డుపక్కనే మ్యాన్‌హోల్ ఉండటంతో వాహన చోదకుల దృష్టి మళితే అందులో పడాల్సిందే. ఇది ఎక